క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నల్లగొండ: విద్యుత్ లైన్‌లకు అడ్డుగా ఉన్న చెట్లను కొడుతున్నందున నల్లగొండ పట్టణంలో మంగళవారం ఉదయం 08:30 గంటల నుంచి 11:30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ ఏడీఈ వేణు గోపాలాచారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రకాశం బజార్, డిస్ట్రిక్ట్ కోర్టు ఏరియా, రిజిస్ట్రేషన్ ఆఫీసు ఏరియా, మున్సిపాలిటీ, పద్మావతి కాలనీ, క్రాంతి నగర్, రామ్ నగర్, మహిళా ప్రాంగణం, మిర్యాలగూడ రోడ్డులో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

సీపీఎం మండల కార్యదర్శిగా మన్నెం భిక్షం



తిప్పర్తి : మండలంలోని సర్వారం గ్రామానికి చెందిన మన్నెం భిక్షం సీపీఎం తిప్పర్తి మండల కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం తిప్పర్తిలో నిర్వహించిన సీపీఎం మండల 8వ మహాసభలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. భిక్షం సీపీఎం మండల కార్యదర్శిగా ఎన్నిక కావడం ఇది మూడోసారి.

కలెక్టర్‌కు ఫిర్యాదు

నల్లగొండ: చండూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హెడ్మాస్టర్ మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం అందించడం లేదని ఆరోపిస్తూ ఎస్సీ ఎస్టీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కట్టెల శివకుమార్ సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఆయన వెంట ఖమ్మంపాటి శంకర్, మార్గం సతీష్ కుమార్, కామల్ల నరేష్ కుమార్, కొండన్న, బాకీ తరుణ్‌లు ఉన్నారు.

నియోజకవర్గ ఉపాధ్యక్షుడిగా రామలింగాచారి

మర్రిగూడ : చేతి వృత్తిదారుల సంఘం మునుగోడు నియోజకవర్గ ఉపాధ్యక్షుడిగా మర్రిగూడ మండలంలోని రాంరెడ్డిపల్లి గ్రామ పరిధి తానేదారుపల్లి గ్రామానికి చెందిన సల్వోజు రామలింగాచారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇటీవల మునుగోడు మండల కేంద్రంలో నిర్వహించిన సంఘం నియోజకవర్గ స్థాయి సదస్సులో రామలింగాచారిని ఎన్నుకున్నారు.

రెవెన్యూ ఉద్యోగుల నిరసన

నల్లగొండ: వికారాబాద్ కలెక్టర్, ఇతర అధికారులపై గ్రామస్తులు దాడి చేయడాన్ని తెలంగాణ గెజిటెట్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.శ్రీనివాస్, కార్యదర్శి జె. బాల్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో ఖండించారు. దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

నాంపల్లి : వికారాబాద్ జిల్లాలో కలెక్టర్, రెవెన్యూ ఉద్యోగులపై జరిగిన దాడికి నిరసనగా సోమవారం నాంపల్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట రెవెన్యూ ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ దేవసింగ్, ఆర్ఐ దయాకర్‌రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

కుమారస్వామికి విశ్వకర్మ లీడర్ అవార్డు

మర్రిగూడ: మండలంలోని యరగండ్లపల్లి గ్రామానికి చెందిన సామాజికవేత్త నారోజు కుమారస్వామి ఈ నెల 13న ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో విశ్వకర్మ లీడర్ అవార్డు అందుకోనున్నారు. కుమారస్వామి గత కొన్నేళ్లుగా గ్రామీణ ప్రాంతాల్లో నిరుపేదలకు వైద్య సేవలు అందించడంతోపాటు ప్రతి గ్రామంలో ఉచిత కంటి వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి వృద్ధులకు కళ్లద్దాలు అందిస్తున్నారు. పేదలకు అన్నదానాలు, విద్యార్థులకు ప్రోత్సాహక అవార్డులు, క్రీడాకారులకు ప్రోత్సాహకం అందిస్తున్నారు. సేవలను గుర్తించి విశ్వకర్మ నాలెడ్జ్ సెంటర్ వారు కుమారస్వామిని విశ్వకర్మ లీడర్ అవార్డుకు ఎంపిక చేశారు.

ఉచిత వైద్య శిబిరం

చిట్యాల: మండలంలోని గుండ్రాంపల్లి జెడ్పీహెచ్‌ఎస్‌లో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సోమవారం దివీస్ లాబోరేటరీస్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ జయంత్ ఆధ్వర్యంలో వైద్యబృందం విద్యార్థులకు పలు రకాల వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు శ్రీనివాసులు, వెంకట్‌రెడ్డి, దివీస్ లాబోరేటరీస్ ప్రతినిధులు ఎస్.సాయి కృష్ణ, వి.వంశీ పాల్గొన్నారు.

మంత్రి దిష్టిబొమ్మ దహనం

నల్లగొండ రూరల్ : మాజీ సీఎం కేసీఆర్‌పై మూసీ పర్యటనలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేశారని నిరసిస్తూ సోమవారం ఎంజీయూ వద్ద బీఆర్‌ఎస్వీ నాయకులు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. కేసీఆర్‌కు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కట్టె శ్రీనివాస్, ఎంజీయూ అధ్యక్షుడు నవీన్, శివప్రసాద్, ప్రకాష్, రాంబాబు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు వినతి

మునుగోడు: అర్హులైన పేదలకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు, నూతన రేషన్ కార్డులు మంజూరు చేయాలని కోరుతూ డీవైఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యుడు కట్ట లింగస్వామి సోమవారం స్థానిక తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం మండల కార్యదర్శి యసరాని వంశీకృష్ణ, చేకూరి ప్రేమ్‌సాగర్, బొందు శివ, జిల్లపల్లి శివ ఉన్నారు.

డంపింగ్ యార్డుగా పెద్ద చెరువు



కట్టంగూర్ పీహెచ్‌సీ సమీపంలో చెత్తచెదారంతో నిండిన పెద్ద చెరువు



నిరుపయోగంగా ఉన్న డంపింగ్‌యార్డు

- చెరువులోనే చెత్తపోస్తున్న పంచాయతీ సిబ్బంది
- పందులకు ఆవాసంగా మారిన చెత్తకుప్పలు
- దుర్వాసనతో ఇబ్బంది పడుతున్న ప్రజలు
- నిరుపయోగంగా కట్టంగూర్‌లోని రెండు డంపింగ్ యార్డులు

కట్టంగూర్ : మండలకేంద్రంలోని పెద్ద చెరువు డంపింగ్ యార్డుగా మారింది. కట్టంగూర్ గ్రామ పంచాయతీకి చెందిన చెత్త సేకరణ ట్రాలీ ఆటో ద్వారా ఇంటింటికి వెళ్లి సేకరించిన చెత్తను పంచాయతీ సిబ్బంది కట్టంగూర్ గ్రామ సమీపంలో ఉన్న పెద్దచెరువులో నింపుతున్నారు. దీంతో చెత్తాచెదారంతో చెరువు పూడిపోతోంది. అదేవిధంగా కాలుష్యం ఏర్పడి చెరువు సమీపంలో ఉన్న శ్రీరాంనగర్ కాలనీ ప్రజలతోపాటు ఎంపీడీఓ, తహసీల్దార్, ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం వద్దకు వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పీహెచ్‌సీ నూతన భవనం ప్రహరీ సమీపంలో చెత్తకుప్పలు పోయడంతో దర్వాసన వచ్చి సిబ్బందితోపాటు ఆరోగ్య కేంద్రానికి వచ్చే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. శ్రీరాంనగర్ కాలనీ ప్రజలు ఈ దారిగుండా ఉదయం వాకింగ్ చేయడంతోపాటు రైతులు ఈ దారిగుండా వ్యవసాయ బావుల వద్దకు వెళుతుంటారు. చెత్తకుప్పలను దాటేటప్పుడు ముక్కుమూసుకుని వెళ్లే పరిస్థితి నెలకొంది. చెరువులో చెత్తకుప్పలు పోయడంతో చెరువు నిండినప్పుడు నీరు కలుషితమయ్యే ప్రమాదం ఉంది.

నిరుపయోగంగా డంపింగ్ యార్డులు

కట్టంగూర్ మండలకేంద్రంలోని పీహెచ్‌సీ సమీపంలో 2020లో ఉపాధి హామీ పథకం కింద లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన రెండు డంపింగ్ యార్డులు నేటికీ ఉపయోగంలోకి రాలేదు. డంపింగ్ యార్డులో జీపీ సిబ్బంది చెత్తను పోయకపోవడంతో డంపింగ్ యార్డులు పూడుకుపోయాయి. చెరువు కట్ట నుంచి డంపింగ్ యార్డుల వరకు ఉన్న బాటకు ఇరువైపులా గుంతలు ఏర్పడడంతోపాటు కంపచెట్లు పెరగడంతో ఆటో వెళ్లే పరిస్థితి లేదు. దీంతో జీపీ సిబ్బంది ప్రభుత్వ కార్యాలయాల వెనుక చెత్తను పోసి చేతులు దులుపుకుంటున్నారు. పీహెచ్‌సీ సమీపంలో చెత్త కుప్పలు పందులకు కుక్కలకు ఆవాసంగా మారాయి. దారిగుండా వెళ్లే ప్రజలు కుక్కలు, పందులతో ఇబ్బందులకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి పీహెచ్‌సీ సమీపంలో ఉన్న చెత్తను తొలగించి డంపింగ్ యార్డుకు తరలించాలని, చెరువులో చెత్తపడవేయకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

డంపింగ్ యార్డుకు చెత్తను తరలించాలి



“మా కాలనీ ప్రజలు చెరువు పక్కనే ఉన్న బాటగుండా మార్నింగ్ వాకింగ్ చేసేటప్పుడు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. చెత్తకుప్పలు పందులకు ఆవాసంగా మారడంతో దారిగుండా వెళ్లేందుకు ప్రజలు, రైతులు ఇబ్బంది పడుతున్నారు. దుర్వాసన రావడంతో దారిగుండా వెళ్లలేకపోతున్నారు. సమీపంలో ఉన్న డంపింగ్ యార్డులకు చెత్తను తరలించాలి. చెరువులో చెత్త పోయడంతో చెరువు నీరు కలుషితయ్యే ప్రమాదంలో ఉంది.

–గోగు బాలసైదులు

చెత్తను డంపింగ్ యార్డుకు తరలిస్తాం

“పెద్ద చెరువు సమీపంలో ఉన్న డంపింగ్ యార్డు వరకు బాట గుంతలమయంగా ఉండడంతో ఆటో వెళ్లే పరిస్థితి లేదు. దీంతో పంచాయతీ సిబ్బంది పీహెచ్‌సీ సమీపంలోని చెరువులో చెత్తను పోశారు. డంపింగ్ యార్డు వరకు బాటను చదును చేసి చెరువులో ఉన్న చెత్తను డంపింగ్ యార్డుకు తరలించేందుకు చర్యలు తీసుకుంటాం.

– వడ్లకొండ అశోక్, పంచాయతీ కార్యదర్శి కట్టంగూర్

మత్స్యకార్మికుల సంక్షేమానికి కృషి

- నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం

నకిరేకల్ : మత్స్యకార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కృషిచేస్తోందని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. నకిరేకల్ పట్టణంలోని పెద్ద చెరువులో మత్స్యశాఖ ఆధ్వర్యంలో చేపపిల్లలను సోమవారం ఎమ్మెల్యే వదిలిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్స్యకార సొసైటీ ద్వారా నకిరేకల్ నియోజకవర్గవ్యాప్తంగా 50 లక్షల పైచిలుకు చేపపిల్లలను ఆయా చెరువులు, కుంటల్లో ఉచితంగా వదిలిపెట్ట కార్యక్రమం చేపట్టిందన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం మత్స్యశాఖ అధికారులు చేప పిల్లలను కాంట్రాక్టర్ల ద్వారా పంపిణీ చేయించాలన్నారు. సొసైటీలు కూడా ప్రైవేట్‌వారికి అప్పగించకుండా కార్మికులే చేపలను పట్టుకుని జీవనోపాధి పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ జిల్లా అధికారి చరితారెడ్డి, స్థానిక మున్సిపల్ చైర్‌పర్సన్ చౌగోని రజితాశ్రీనివాస్‌గౌడ్, వార్డు కౌన్సిలర్లు గాజుల సుకన్య, పన్నాల పావని శ్రీనివాస్‌రెడ్డి, కందాల భిక్షంరెడ్డి, రాచకొండ సునీల్, జిల్లా మత్స్యపారిశ్రామిక సహకార సంఘం చైర్మన్ కనుకుట వెంకటనారాయణ, మూసీ మత్స్య సంఘం మాజీ చైర్మన్ సాదుల నర్సయ్య, జిల్లా డైరెక్టర్లు తవిడబోయిన ఆంజనేయులు, కొల్లు సైదులు, చెన్నబోయిన వీరయ్య, స్థానిక మత్స్య సంఘం అధ్యక్షుడు బండమీది నర్సింహ పాల్గొన్నారు.



పెద్ద చెరువులో చేప పిల్లలను వదిలిపెడుతున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

అబుల్ కలాం సేవలు మరువలేనివి



మాట్లాడుతున్న ఆర్డీఓ అశోక్‌రెడ్డి



నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

నల్లగొండ: భారత దేశ తొలి విద్యాశాఖ మంత్రిగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ విద్యారంగానికి చేసిన సేవలు మరువలేనివని నల్లగొండ ఆర్డీఓ అశోక్‌రెడ్డి అన్నారు. సోమవారం నల్లగొండ పట్టణ పరిధిలోని ఎస్ఎల్‌బీసీ మైనార్టీ రెసిడెన్షియల్ బాలుర పాఠశాలలో అల్ప సంఖ్యాక వర్గాల సంక్షేమ దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆర్డీఓ అశోక్‌రెడ్డి హాజరై ఆజాద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆజాద్ జయంతిని ప్రభుత్వం ప్రతి సంవత్సరం నవంబర్ 11న మైనార్టీ సంక్షేమ దినోత్సవంగా నిర్వహిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో విద్యనభ్యసించాలి

విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా సోమవారం నల్లగొండలోని మైనార్టీ గురుకుల బాలికల పాఠశాలలో అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ మైనార్టీ గురుకుల పాఠశాలలకు ఎలాంటి అవసరాలు ఉన్నా కోమటిరెడ్డి ప్రతీక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ నల్లగొండ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి, విజేందర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ చౌహాన్, చాంద్ పాషా, ఎండీ సలీం, ఏఏ ఖాన్ బషీరుద్దీన్, ముజీబ్, హఫీస్ ఖాన్, నజీర్, రియాజ్, ఖయ్యూం బేగ్ మైనార్టీ సంఘం నాయకులు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలి

నల్లగొండ టౌన్: ఐకేపీ వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని తెలంగాణ ఐకేపీ వీఓఏ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.రమ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం సంఘం ఆధ్వర్యంలో నల్లగొండ కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన ధర్నాకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వీఓఏలకు కనీస వేతనం అమలు చేయాలన్నారు. సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు చిన్నపాక లక్ష్మీనారాయణ మాట్లాడుతూ వీఓఏలను టార్గెట్ల పేరుతో సీసీలు, ఏపీఎంలు వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దండంపల్లి సత్తయ్య, వీఓఏల సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు చిలుముల దుర్గయ్య, పాడిచేటి సులోచన, పోలె సత్యనారాయణ, జిల్లా లలిత, ఎం.మంగమ్మ, ఆర్.బాలకృష్ణ, అహల్య, నాగమణి, పద్మావతి, పాపయ్య, సువర్ణ, సైదులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఐకేపీ వీఓఏలు

సీపీఐ శత వార్షికోత్సవాలను విజయవంతం చేయాలి

కేతేపల్లి: సీపీఐ ఆవిర్భవించి వంద సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా నిర్వహిస్తున్న పార్టీ శత వార్షికోత్సవాలను విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా సహాయ కార్యదర్శి లొడంగి శ్రవణ్‌కుమార్ పిలుపునిచ్చారు. సోమవారం కేతేపల్లిలో నిర్వహించిన సీపీఐ మండల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పార్టీ శత వార్షికోత్సవాల్లో భాగంగా గ్రామాల్లో జెండాలు ఎగురవేయాలన్నారు. సమావేశంలో సీపీఐ మండల కార్యదర్శి ఊట్కూరి నాగరాజు, గోలి ఆంజనేయులు, నర్సయ్య, బోడ వెంకన్న, సాయికుమార్, ప్రేమ్‌కుమార్, అంబేద్కర్, సైదులు పాల్గొన్నారు.

మూడు ఇళ్లల్లో చోరీ

నార్కట్‌పల్లి : మండలంలోని మాధవ ఎడవల్లి గ్రామ పంచాయతీ పరిధిలో గల సన్‌షైన్ కాలనీలో ఆదివారం మూడు ఇళ్లల్లో చోరీ జరిగింది. స్థానిక పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాలనీలో అద్దెకు ఉంటున్న శేషగిరిరావు, రచన ఆదివారం సెలవు కావడంతో వేరే గ్రామానికి వెళ్లి సోమవారం ఉదయం వచ్చేసరికి ఇంటికి వేసిన తాళం పగులగొట్టి ఉంది. తలుపులు తెరిచి ఉండడంతో వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. సీఐ నాగరాజు, ఎస్ఐ క్రాంతికుమార్ సంఘటన స్థలానికి చేరుకుని ఇంటిని పరిశీలించారు. ఇంట్లో రూ.40 వేల నగదు, నాలుగు గ్రాముల బంగారం చోరీకి గురైందని శేషగిరిరావు వివరించారు. అదేవిధంగా కాలనీలో దుండగులు మరో రెండు ఇళ్లలో చోరీకి ప్రయత్నించగా వారి ఇళ్లల్లో ఏ రకమైన వస్తువులు దొంగతానికి గురికాలేదు. డీఎస్పీ శివరాంరెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని క్లూస్ టీం ద్వారా చోరీ జరిగిన ఇంటిని పరిశీలించినారు, బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ధాన్యం కాంటాలు వేగవంతం చేయండి

- అదనపు కలెక్టర్ శ్రీనివాస్



ధాన్యాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

తిప్పర్తి : తేమ శాతం వచ్చిన ధాన్యానికి వెంటనే కాంటాలు వేసి ఎగుమతి చేయాలని అదనపు కలెక్టర్ జే.శ్రీనివాస్ కొనుగోలు కేంద్రాల నిర్వాహకులను ఆదేశించారు. సోమవారం తిప్పర్తి మండల కేంద్రంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు నిబంధనల మేరకు తీసుకువచ్చి మద్దతు ధర పొందాలన్నారు. కార్యక్రమంలో డీఎస్ఓ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ స్వప్న, ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రెడ్డి, ఏఓ సన్నిరాజు, సీఈఓ భిక్షమయ్య తదితరులు ఉన్నారు.

కుటుంబ సర్వేను పకడ్బందీగా చేయాలి

మర్రిగూడ : ఎన్యుమరేటర్లు సమగ్ర కుటుంబ సర్వేను పకడ్బందీగా చేయాలని చండూరు ఆర్డీఓ వి.శ్రీదేవి అన్నారు. సోమవారం మర్రిగూడ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో పలు శాఖల అధికారులతో సర్వేపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్యుమరేటర్లకు ప్రతిఒక్కరు సహకరించాలన్నారు. మండల వ్యాప్తంగా 11097 కుటుంబాలు ఉన్నాయని పేర్కొన్నారు. సమావేశంలో తహసీల్దార్ బక్క శ్రీనివాసులు, డీటీ జూటూరు తారకరామన్, ఎంపీఓ రవికుమార్, ఎంఈఓ బిట్టు శ్రీనివాస్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వెంకటేశ్వర్లు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ముమ్మడి యశోద, ఏపీఎం ప్రభాకర్, ఏపీఓ వివేక్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్డీఓ శ్రీదేవి

అక్కెనపల్లి విద్యార్థుల ప్రతిభ



మెమెంటో స్వీకరిస్తున్న విద్యార్థులు

నార్కట్‌పల్లి; మండలంలోని అక్కెనపల్లి హైస్కూల్ విద్యార్థులు నితిన్, రామ్‌చరణ్ సంగారెడ్డి జిల్లా కేంద్రంలో జరిగిన ఎస్‌జీఎఫ్ 68వ రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉమ్మడి నల్లగొండ జిల్లా టీం తరఫున పాల్గొన్ని ద్వితీయ బహుమతి సాధించారని ప్రధానోపాధ్యాయుడు నడింపల్లి వెంకటేశం, వ్యాయామ ఉపాధ్యాయుడు ఇమామ్ కరీం తెలిపారు. సోమవారం వారికి పాఠశాల ఆవరణలో రాష్ట్రస్థాయి మెరిట్ సర్టిఫికెట్, మెమెంటో అందజేసి అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్‌రెడ్డి, మదనయ్య తదితరులు ఉన్నారు.

కరాటే పోటీల్లో ..

చండూరు : జపాన్ కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నకిరేకల్‌లో ఆదివారం జరిగిన పది సంవత్సరాలలోపు 38వ షాటోఖాన్ జాతీయ స్థాయి కరాటే పోటీల్లో చండూరు మండలానికి చెందిన నలుగురు విద్యార్థులు కాంస్య పతకాలు గెలుపొందారు. గీత విద్యాలయానికి చెందిన సంకోజు సాయి ప్రణయ్, సంకోజు మణిదీప్, కారింగు అభిరామ్, కృష్ణవేణి పాఠశాలకు చెందిన ఇరిగి భానుతేజ పతకాలు సాధించారు. వారికి శిక్షణ ఇచ్చిన మాస్టర్ కారింగు రవి సోమవారం విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో మాస్టర్స్ రాపోలు సుదర్శన్, అంతటి సోములుగౌడ్, నగేష్ గౌడ్ పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న మాస్టర్

భక్తిశ్రద్ధలతో కార్తీక మాస పూజలు



కార్తీక మాసం రెండో సోమవారం సందర్భంగా నల్లగొండ పట్టణంలోని శివాలయాల్లో భక్తులు శివుడికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. పానగల్లు ఛాయా, పచ్చల సోమేశ్వరాలయాల్లో, బీట్ మార్కెట్‌లోని రామకోటి స్తూప ఆలయంలో, తులసీనగర్‌లోని కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయాల్లో భక్తుల సందడి నెలకొంది.

–సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నల్లగొండ

పెట్టుబడిదారులకు వ్యతిరేకంగా పోరాడుదాం

కనగల్: పెట్టుబడిదారులకు వ్యతిరేకంగా పోరాడాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి పిలుపునిచ్చినారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన పార్టీ సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా పార్టీ జెండాను సీనియర్ నాయకుడు బ్రహ్మానందరెడ్డి ఎగురవేశా రు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పాలడుగు నాగార్జున, నెలగొందరాశి లింగయ్య, సుల్తానా, శంకర్, సైదులు, లింగస్వామి, అక్రమ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి

నరహరికి అవార్డు



అవార్డు అందుకుంటున్న నరహరి

నల్లగొండ : భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ లో విశిష్ట సేవలు అందించినందుకుగాను సీనియర్ స్కౌట్ సైడ్ గైడ్స్ జిల్లా ఆర్గనైజింగ్ మాజీ కార్యదర్శి మొలకల నరహరిని తెలంగాణ స్టేట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ సోమవారం హైదరాబాద్‌లో అవార్డు అందజేసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అరుణాచలంకు ప్రత్యేక బస్సు

నకిరేకల్ : ప్రతి నెల పౌర్ణమి సందర్భంగా గిరి ప్రదక్షిణ చేసేవిధంగా అరుణాచల బస్‌యాత్ర సౌకర్యాన్ని సూర్యాపేట ఆర్టీసీ డిపో నుంచి కల్పించామని డిపో అసిస్టెంట్ మేనేజర్ బానోతు సైదులు తెలిపారు. నకిరేకల్ పట్టణంలోని మెయిన్ సెంటర్‌లో సూర్యాపేట ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో అరుణాచలం యాత్రపై సోమవారం ప్రచారం నిర్వహించారు. ఈ నెల 15న కార్తీక పౌర్ణమి సందర్భంగా సూర్యాపేట ఆర్టీసీ డిపో నుంచి 36 సీట్లతోకూడిన ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఒక్కొక్కరికి రూ.4000 బస్ చార్జీ నిర్ణయించారని పేర్కొన్నారు. ఈ నెల 13న సూర్యాపేట నుంచి బస్సు బయలుదేరి 14న ఉదయం కాణిపాకంలోని వరసిద్ధి వినాయక దర్శనం, సాయంత్రం వేలూరులోని గోల్డెన్ టెంపుల్ దర్శనం, రాత్రికి అరుణాచలంలో బస ఉంటుందన్నారు. 15 న పౌర్ణమి సందర్భంగా తెల్లవారుజామున అరుణాచల గిరి ప్రదక్షిణ, స్వామివారి దర్శనం ఉంటుందన్నారు. సాయంత్రం 5 గంటలకు సూర్యాపేటకు తిరుగు ప్రయాణం ఉంటుందని వివరించారు. ఈ కార్యక్రమంలో నకిరేకల్ ఆర్టీసీ కంట్రోలర్ మన్నాన్ పాల్గొన్నారు.

మూసీ ప్రక్షాళన కాంగ్రెస్‌తోనే సాధ్యం

కట్టంగూర్ : మూసీ ప్రక్షాళన కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పెద్ది సుక్కయ్య అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ బీజేపీకి బీటీమ్ వ్యవహరిస్తోందని మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అనడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ సమావేశంలో పీసీసీ డెలికేట్ సుంకరబోయిన నర్సింహ, రెడ్డిపల్లి సాగర్, వల్లపు శ్రీనివాసరెడ్డి, మర్రి రాజు, దానయ్య, బూరుగు శ్రీను, ధార భిక్షం, చింత వెంకటనర్సయ్య, రెడ్డిపల్లి వీరస్వామి, రవీందర్‌రెడ్డి, బాలరాజు, గణేశ్ ఉన్నారు.

పేద విద్యార్థులకు సేవ చేయడమే లక్ష్యం

నాంపల్లి : పేద విద్యార్థులకు సేవ చేయడమే తన లక్ష్యమని కస్తూరి ఫౌండేషన్ చైర్మన్ సాయిచరణ్ అన్నారు. నాంపల్లి మండలంలోని పస్నూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు సోమవారం ఆయన బెంచీలు, కుర్చీలు, విద్యార్థులకు డైరీలు,నోట్ బుక్స్‌లను పంపిణీ చేసి మాట్లాడారు. ఇన్‌చార్జ్ ఎంఈఓ మల్లికార్జున్, ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు నక్క యుగేందర్, ఫౌండేషన్ సభ్యులు నవీన్‌రెడ్డి, మహేష్, సతీష్, పోలగోని శ్రీకాంత్ ఉన్నారు.

దుప్పట్లు అందజేత

కనగల్: న్యూ కంబాల శివలీల ఫౌండేషన్ ఆధ్వర్యంలో కనగల్ మండల పరిధిలోని దర్వేశిపురం శ్రీ రేణుక ఎల్లమ్మ గుడి వద్ద వృద్ధులకు, దివ్యాంగులకు డాక్టర్ శివలీల సోమవారం దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సమాచార హక్కు సంరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు బండమీది అంజయ్య, గుండెబోయిన మన్నెమ్మ పాల్గొన్నారు.

ఘనంగా రుద్రహోమం

నకిరేకల్ : పట్టణ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో శ్రీ మార్కండేయ స్వామి ఆలయ నిర్మాణ ప్రారంభోత్సవం సందర్భంగా సోమవారం రుద్రహోమం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో పద్మశాలి సంఘం పట్టణ అధ్యక్ష,కార్యదర్శులు ముడుదుడ్ల కృష్ణమూర్తి, బోనగిరి యాదగిరి, ఆలయ కమిటీ అధ్యక్షుడు పెండెం సదానందం, కోశాధికారి అలువాల నరేందర్, ప్రతినిధులు పాల్గొన్నారు.

దొంగతనం కేసులో ఒకరి అరెస్టు, రిమాండ్

కనగల్ : మండల కేంద్రంలో నెల క్రితం ముద్దం నాగరాజు ఇంటి తాళాలు పగులగొట్టి బీరువాలో ఉన్న తులంన్నర బంగారం, రూ.22 వేల నగదు దొంగలు అపహరించారు. ఈ కేసులో కనగల్ గ్రామానికి చెందిన రాయల రామకృష్ణను సోమవారం అరెస్టు చేసి తులంన్నర బంగారం, రూ.2500, సెల్ ఫోన్ స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ విష్ణుమూర్తి తెలిపారు.

ధరల నియంత్రణలో ప్రభుత్వాలు విఫలం

కేతేపల్లి: నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు తుమ్మల వీరారెడ్డి విమర్శించారు. సోమవారం కేతేపల్లిలో నిర్వహించిన సీపీఎం మండల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యురాలు కందాల ప్రమీల, జిల్లా కమిటీ సభ్యులు బొజ్జ చినవెంకులు, మండల కార్యదర్శి సీహెచ్.లూర్ధుమారయ్య తదితరులు పాల్గొన్నారు.

మద్దతు ధరకు కొనుగోలు చేయాలి

శాలిగౌరారం: పంటలను మద్దతు ధరలకు కొనుగోలు చేయాలని సీపీఎం రాష్ట్ర నాయకుడు తుమ్మల వీరారెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. మండల కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో పార్టీ 8వ మండల మహాసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కందాల ప్రమీల, చలకాని మల్లయ్య, లింగయ్య, బుచ్చిరాములు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలి

నల్లగొండ : పెన్షనర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని పెన్షనర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి దామోదర్ రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక పెన్షనర్స్ భవన్‌లో జిల్లా అధ్యక్షుడు వెంకటరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. జిల్లా ప్రధాన కార్యదర్శి జిల్లా శ్రీశైలం గాయం నారాయణరెడ్డి, కే రామలింగం, ఎన్ రంగయ్య బి.మోహన్ రావు పాల్గొన్నారు



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు దామోదర్ రెడ్డి